స్థలం మార్చేసి.. వదిలేసి..



మోసం గురూ!

ఖాళీగా గిరిజన యూనివర్సిటీ భూములు



- అంగుళం కదలని గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు
- అంచనా కొండంత.. నిధులు విడుదల గోరంత
- భూముల పరిహారంపైనా ప్రభుత్వం కాకి లెక్కలు
- అరకొర విదిలింపుపై రైతుల గగ్గోలు
- సంవత్సరాలుగా విజయనగరంలోనే వర్సిటీ తరగతులు
- ఎన్నాళ్లీ తాత్కాలిక వసతి అంటూ విద్యార్థుల నిరాశ

గిరిజన యూనివర్సిటీ.. రాష్ట్ర విభజన హామీల అమలులో భాగంగా కేంద్రం ప్రకటించిన ఉన్నత విద్యాలయం. భవన నిర్మాణం పూర్తయితే 14 అకడమిక్ కోర్సుల్లో గిరిజన విద్యార్థులు చదువుకునే అవకాశం ఉండేది. వారి బంగారు భవిష్యత్‌కు చక్కని అడుగులు పడి ఉండేవి. కేంద్రం తలచినది ఇదైతే జరుగుతున్నది మరొకటి. ఎనిమిదేళ్ల కిందటే వర్సిటీ భూసేకరణ పూర్తయ్యి ప్రహరీ నిర్మాణం మొదలై.. తాత్కాలికంగా విజయనగరంలో తరగతులు ప్రారంభం కాగా వైసీపీ ప్రభుత్వం పుణ్యమాని ఇప్పటికీ వర్సిటీ ఎక్కడుందో చెప్పలేని దుస్థితి. గత ప్రభుత్వం నిర్మాణానికి సిద్ధపడగా ఈ ప్రభుత్వం స్థలం మార్చేసి వదిలేసింది. ఎన్నాళ్లీ తాత్కాలిక వసతి అంటూ విద్యార్థులూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- మెంటాడ

"గిరిజన విద్యార్థుల కల నెరవేరే రోజు ఎంతో దూరంలో లేదు. గత ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీని గాలికొది లేసింది. మన ప్రభుత్వం ఇప్పుడు శంకుస్థాపన చేసింది. ఈ రోజునుంచే పనులు పరుగులు తీస్తాయి" ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి జగన్ వల్లెవేసిన పలుకులివి. ఆబ్బో జగనన్నకి ఎంత ప్రేమో అని విద్యార్థులు మురిసిపోయారు. ఎనిమిది నెలలైనా పనులే ప్రారంభం కాలేదు. భూములిచ్చిన అన్నదాతలకైనా పూర్తి స్థాయిలో పరిహారం అందిందా అంటే అదీ లేదు. పనులు ఎప్పుడు మొదలుపెడతారని అడిగితే జవాబు చెప్పే నాథుడు లేడు. టీడీపీ ప్రభుత్వ హయంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం కొత్తవలస మండలం రెల్లి గ్రామం వద్ద సుమారు 500 ఎకరాలను సేకరించింది. తొలివిడత నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే పనులు ప్రారంభించింది. ప్రహరీని పూర్తి చేసింది. అంతలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగింది. వర్సిటీకి కూడా గ్రహణం మొదలైంది. నాలుగేళ్ల పాటు ఏవేవో సాకులు చెప్పి తర్వాత స్థలం మార్చేశారు. మెంటాడ మండలం కుంతినవలస దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల పరిధిలో 561.88 ఎకరాలను సేకరించారు. రూ.834 కోట్లతో భవన నిర్మాణం ప్రారంభించాలని నిర్ణయించారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా శంకుస్థాపనకు హాజరయ్యారు. ఎన్నికల ముంగిట క్రతువుని హట్టహాసంగా జరిపారు. ఎనిమిది నెలలైనా పనులు మొదలుకాలేదు.

ఇంకెన్నాళ్లు అంటున్న విద్యార్థులు

గిరిజన వర్సిటీ పూర్తయితే పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇంగ్లీష్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, జర్నలిజం, ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యు, డిగ్రీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్, బి.కాంలో ఒకేషనల్ తదితర 14 అకడమిక్ కోర్సులు అందుబాటులోకి వస్తాయి. ఈ వివరాలను ఎంతో గొప్పగా శంకుస్థాపన సభలో చెప్పుకొచ్చిన జగన్ 8 నెలలుగా పనులు మొదలు కాకపోయినా సమీక్షించిన దాఖలాలు లేవు. దాదాపు పదేళ్లగా ఎదురుచూస్తున్న గిరిబిడ్డలు ఇంకెన్నాళ్లని ప్రశ్నిస్తున్నారు.

రైతులపై కపట ప్రేమ..

గిరిజన వర్సిటికి సేకరించిన 561 ఎకరాల్లో జిరాయితీ కేవలం 66 ఎకరాలు కాగా డిపట్టా, ఆక్రమణ, గెడ్డవాగు భూములు అధికం. జిరాయితీకి ఎకరాకు రూ.16 లక్షలు, డిపట్టాకు ఎకరాకు రూ.9 లక్షలు, ఆక్రమణ భూములకు రూ.3 లక్షల వంతున పరిహారం ఇస్తామని చెప్పుకొచ్చారు. సొమ్ము చెల్లించాక భూముల్లోకి అడుగు పెడతామన్నారు. అరకొరగా ఇచ్చి మమ అనిపించేశారు. ఆయా భూముల్లో ఉన్న వృక్ష సంపదకు, బోర్లు, బావులకు కూడా పరిహారం ఇస్తామని చెప్పి విస్మరించారు. భూములు త్యాగం చేసినందుకు ఇదా బహుమానం అని రైతులు ఆగ్రహిస్తున్నారు..

ప్రశ్నిస్తే బెదిరింపులు....

పరిహారం అందని రైతులు తాము ఇచ్చిన భూముల్లో ప్రస్తుత సీజన్లో పంటకు వచ్చిన మామిడి, జీడిమామిడిని సేకరించాలనుకున్నారు. రైతులు పంట కోతకు వెళ్తే అక్కడి కాపలాదారులు నో ఎంట్రీ చెప్తున్నారు. భూములిచ్చిన రైతులమయ్యా అని చెప్పుకున్నా పట్టించుకోవడం లేదు. మొండికేస్తే కేసులు పెడతామని జులుం ప్రదర్శిస్తున్నారని బాధిత రైతాంగం కన్నీటి పర్యంతమవుతోంది.

నిధులు ఏమైనట్టు?

గిరిజన వర్సిటీకి భూములిచ్చిన రైతులకు పరిహారం కింద రూ.29.97 కోట్లు చెల్లించినట్టు, మౌలిక వసతుల కల్పనకు మరో రూ.28.49 కోట్లు చెల్లించినట్టు ప్రభుత్వం చెప్పుకొస్తోంది. అలాంటప్పుడు రైతులకు అరకొర పరిహారం అందడంలో మర్మమేమిటన్నది సర్కారే సెలవివ్వాలి. అలాగే మౌలిక సదుపాయాల కల్పిన కోసం రూ.28.49 కోట్లు ఇచ్చామని చెబుతున్నప్పుడు పనులు అంగుళం కూడా ముందుకు కదల్లేదంటే ఏమని అర్థం చేసుకోవాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భూములు త్యాగం చేసిన రైతులందరిదే ఒకటే వ్యథ. జీవితాలకు ఆదరువుగా ఉన్న భూములిచ్చిన పాపానికి తమను రోడ్డుపాలు చేశారంటూ కన్నీరుమున్నీరవుతున్నారు.



గిరిజన యూనివర్సిటీకి భూములిచ్చిన రైతు కుటుంబాలు

కారుచౌకగా కొట్టేయాలని వ్యూహం

మొదట్లో రెల్లివలస వద్ద భూమి సేకరించారు. మళ్లీ పాచిపెంట మండలంలో స్థల సేకరణ చేశారు. అక్కడ జిరాయితీ భూములు ఎక్కువగా వుండడంతో రైతులకు పరిహారం ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని భావించి కుంటినవలస వద్ద భూ సేకరణకు దిగారు. ఇక్కడ కేవలం 66 ఎకరాలు జిరాయితీ వుండడం, గెడ్డ వాగు 250 ఎకరాలు, మిగతా డిపట్టాలు సుమారు 300 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. కొండకు ఆనుకొని వందలాది ఎకరాలు ఉండడంతో ఇక్కడ ప్రభుత్వ పెద్దలంతా వాలిపోయారు. ఈ ప్రాంతమే యూనివర్సిటీకి అనువైనదంటూ ఎంపిక చేశారు.

సమాధానం చెప్పేవారేరి?



మా నాన్న నగర రాము జిరాయితీ, డిపట్టా కలిపి 3.82 ఎకరాలు ఇస్తే రూ.16 లక్షలే ముట్టజెప్పారు. మిగతాసొమ్ము గురించి సమాధానం చెప్పేవారు కరువయ్యారు. భూములు పోయాయి పూర్తి పరిహారం అందలేదు. చెట్లు గురించి అడిగితే ఉలుకూపలుకు లేదు.

-అలమండ గౌరి, రైతు కుంతినవలస గ్రామం

రెండెకరాలకు రూ.2 లక్షలా?



రెండెకరాల డిపట్టా భూమికి కేవలం రూ.రెండు లక్షలు ఇచ్చారయ్యా. ఇదెక్కడి న్యాయం? ఇలా చేస్తారనుకోలేదు. ఇంటి కొక ఉద్యోగం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పట్లో చెప్పారు. ఇప్పుడు వాటి ఊసు ఎత్తితే పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. మమ్మల్ని చీడపురుగుల్లా చూస్తున్నారు.

-జంగం రాము కుంటినవలస గ్రామం

దొంగల్లా చూస్తున్నారు..



20 ఏళ్ల క్రితం డిపట్టాలు ఇచ్చారు. ఇంటిల్లిపాదీ బిందెలతో నీరుమోసి జీడిమామిడి సాగుచేశాం. ఫలసాయం అందుతుందనేసరికి భూములు లాగేసుకున్నారు. ఎకరానికి రూ.9 లక్షలు అనిచెప్పి రూ.1.60 లక్షలే ఇచ్చారు. భూముల, చెట్లు పోయాయి. డబ్బులు పడలేదు. తోటలోకి వెళితే తరిమేస్తున్నారు. దొంగల్లా చూస్తున్నారు.

-చాకల పెద సింహాచలం, కుంటినవలస గ్రామం

మమ్మల్నే తరిమేస్తున్నారు..



ఎకరం జిరాయితీ భూమికి రూ.16 లక్షలు అని చెప్పి రూ.4లక్షలు ఇచ్చి గొప్ప ఉపకారం చేసినట్టు చెప్పుకొస్తున్నారు. ఇంత అన్యాయం చేస్తారనుకోలేదు. వంట చెరుకు కోసం నా భూమిలోకి వెళ్తే దొంగలా చూస్తున్నారు. కలవని అధికారులు లేరు. ఎక్కని గడపలేదు. గ్రామ పెద్దలు సైతం పట్టించుకోవడం లేదు.

-కర్రి చిన్నమ్మ, రైతు, కుంటినవలస

కనికరించడం లేదు



భర్త సహా నా అన్న వారెవరూ లేరు. జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నాను. 1.30 ఎకరాల డిపట్టా భూమి తీసుకొని కేవలం రూ.2లక్షలే చేతిలో పెట్టారు. ఇచ్చిన దాంతో సరిపెట్టుకోమన్నారు. ఎక్కడికీ వెళ్లలేక కూతురు వద్ద తలదాచుకుంటున్నాను. వికలాంగ పింఛన్‌తో కాలం నెట్టుకొస్తున్నాను.

-సింగారపు లక్ష్మి, దివ్యాంగురాలు, కుంటినవలస

శిలాఫలకం ఎక్కడ?

ఆగస్టు 25న ముఖ్యమంత్రి జగన్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చకచకా పనులు జరిగిపోతాయని అన్నారు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర తాను చెమటోడ్చి యూనివర్సిటీని ఇక్కడకు తీసుకొచ్చానని చెప్పుకొచ్చారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కూడా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని తన అన్న మంత్రి బొత్స సత్యన్నారాయణతో మాట్లాడి వర్సిటీని తెచ్చానని పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ప్రారంభోత్సవం అయిన వెంటనే అధికారులు శిలాఫలకాన్ని అక్కడ నుంచి తొలగించేశారు. శిలాఫలకం జాడలేదు.. అంగుళం అభివృద్ధి లేదు.

తరగతి మారేనా?



పేరుకు పాఠశాల. తరగతి గదులు నిర్వహించేది మాత్రం ఓ ఇంటిలో.. వినడానికి చిత్రంగా ఉన్నా ఇది నిజం. నాడు-నేడు అంటూ ఊదర గొట్టే ప్రభుత్వానికి ఆ పాఠ శాల దుస్థితి కనిపించలేదు. శిథిల భవనాల్లో ఉంటున్న తమ పిల్లలను చూసిన స్థానికులు భయపడి ఓ ఇంట్లోని గదిని కేటాయించారు. అందులోనే ఉపాధ్యాయురాలు పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. భోగాపురం పంచాయతీ చెరువుకొమ్ముగొల్లపేట ప్రాథమిక పాఠశాల దుస్థితిదీ. ఇక్కడ 1 నుంచి 5వ తగరతి వరకు 11 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఈ ఏడాదైతే వేసవి సెలవులు ఇచ్చేశారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా ఆ పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- భోగాపురం

ఓటింగ్ శాతం పెరగాలి

- ఓటర్ల స్లిప్పులను శతశాతం పంపిణీ చేయండి
- ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్

కలెక్టరేట్, ఏప్రిల్ 26: జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ఓటర్ల స్లిప్పులను పూర్తి వివరాలతో శతశాతం పంపిణీ చేయడం ద్వారా పోలింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ చెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణకు జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికాపాటిల్ వివరించారు. ఓటర్లు, నియోజకవర్గాలు, ఎన్నికల సిబ్బంది సమీకరణ, వారికి ఇచ్చిన శిక్షణ గురించి తెలియజేశారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ కూడా పూర్తయ్యిందన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల సమయం తక్కువగా ఉందని, ఏర్పాట్లు ముమ్మరం చేయాలన్నారు. మారుమూల ప్రాం తాలు, గిరిజన ప్రాంతలకు సిబ్బంది చేరుకొనేందుకు అనువైన వాహనాలను సమకూర్చాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక ప్రచార కార్యక్రమాలు పెరుగుతాయని, కోడ్ ఉల్లంఘనలపై దృష్టి సారించాలని సూచించారు. కోడ్ ఉల్లంఘనలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి కెమెరాలు, సెల్ ఫోన్లను అనుమతించవద్దని చెప్పారు. హోమ్ ఓటింగ్‌లో ఓటరు రహస్యంగా ఓటువేసే అవకాశాన్ని కల్పించాలని, కంపార్ట్‌మెంట్‌లో ఓటు వేస్తున్నప్పుడు వీడియో రికార్డింగ్ చేయకూడదని చెప్పారు. పోలీసు పరిశీలకుడు సచింద్ర పటేల్ మాట్లాడుతూ, శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ కార్తీక్, ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్‌వో అనిత పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై వివరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నామినేషన్ల పరిశీలన పూర్తి

- నేటి నుంచి ఉపసంహరణకు అవకాశం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ఘట్టంలో మరో తంతు పూర్తయింది. అభ్యర్థులు వేసిన నామినేషన్లను అధికారులు పరిశీలించి సరిగా లేనివాటిని శుక్రవారం తిరస్కరించారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు పూర్తి చేశారా లేదా.. అన్ని ధ్రువీకరణ పత్రాలూ ఉన్నాయా.. అఫిడవిట్లు సరిగా ఉన్నాయా.. ఫొటోలు, మద్దతుదారుల సంతకాలు, దరావతు, కొత్త బ్యాంక్ ఖాతా ఇలా అన్నింటినీ పరిశీలించి సరిగా ఉన్నవాటిని ఆమోదించారు. లేని వాటిని తిరస్కరించారు. ఎక్కడ పొరపాటు ఉన్నా ఆ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు టెన్షన్ పడుతుంటారు. ఆమోదం తెలిపితే ఊపిరి పీల్చుకుంటారు. అలాగే ఏదైనా రాజకీయ పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్లు వేసి ఉంటే అసలు అభ్యర్థి నామినేషన్‌కు ఆమోదం లభించాక మిగిలిన వాటిని తొలగించాలని కోరుతుంటారు. ఇలా శుక్రవారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఆర్వోలు పూర్తి చేశారు. కాగా నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం వరకు గడువుంది.

నియోజకవర్గం	తిరస్కరించినవి	ఆమోదించినవి
విజయనగరం	4	16
నెల్లిమర్ల	3	13
చీపురుపల్లి	5	8
రాజాం	2	10
బొబ్బిలి	4	9
గజపతినగరం	2	13
శృంగవరపుకోట	2	14
పార్లమెంట్‌కు	3	15



బొబ్బిలిలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో సాయిశ్రీ

పోస్టల్ ఓటుకు ముప్పుతిప్పలు

- ఎస్.కోట ఎన్నికల అధికారుల తీరుపై ఉద్యోగుల అసహనం

శృంగవరపుకోట ఏప్రిల్ 26: శృంగవరపుకోట ఎన్నికల రిటర్నింగ్ అధికారి (తహసీల్దార్) కార్యాలయానికి శుక్రవారం కొందరు ఉద్యోగులు వచ్చారు. పోస్టల్ ఓటేసేందుకు దరఖాస్తులను తీసుకొచ్చారు. వాటిని తీసుకొనే ఎన్నికల అధికారి అక్కడ అందుబాటులో లేరు. మిగిలిన అధికారులు వీటిని తీసుకొనేందుకు ఇష్టపడలేదు. దరఖాస్తులు సమర్పించేందుకు ఆఖరి రోజు కావడంతో వచ్చిన ఉద్యోగులు ఆందోళన చెందారు. వేరే నియోజకవర్గాల పరిధిలో ఉద్యోగాలు చేస్తున్నారు కాబట్టి అక్కడి రిటర్నింగ్ అధికారికి ఈ దరఖాస్తులు సమర్పించాలంటూ ఓ అధికారి మెలికపెట్టారు. వాదోపవాదనల తరువాత చాలా సమయం నిరీక్షించాక మరో అధికారి చొరవతో తీసుకున్నారు. పోస్టల్ ఓటు దరఖాస్తులు స్వీకరించే అధికారి అందుబాటులో లేకపోవడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కాగా శుక్రవారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఇందుకోసం అభ్యర్థులు, వారు నియమించుకున్న ఏజెంట్లు ఆర్వో కార్యాలయానికి వచ్చారు. ఓ అభ్యర్థి కార్యాలయ ఆవరణలోనే కారు పార్కింగ్ చేశారు. దీనిపై విమర్శలు వినిపించాయి.

నేడే పాలిసెట్

- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- హాజరు కానున్న 8,864 మంది విద్యార్థులు

కలెక్టరేట్/ బొబ్బిలి, ఏప్రిల్ 26: పాలిసెట్ ప్రవేశ పరీక్ష శనివారం జరగనుంది. అధికారులు ఏర్పాట్లు పూర్తిచే శారు. జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పరీక్ష జరగనుంది. 8,864 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్ అమలు చేస్తారు. వైద్య సిబ్బంది, మంచినీరు అందుబాటులో ఉంచారు. పరీక్ష రాసిన సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 11 కేంద్రాల్లో 4509 మంది విద్యార్థులు, గజపతినగరం 6 కేంద్రాల్లో 2009 మంది, బొబ్బిలి 7 కేంద్రాల్లో 2346 మంది హాజరు కానున్నారు. పరీక్ష రాసే విద్యార్థి ఖచ్చితంగా పరీక్ష సమయం కంటే గంట ముందు హాజరు కావాలి.

అంటే ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. నిమిషం దాటినా కేంద్రంలోకి అనుమతించరు. ఇతర వివరాలకు 7989781520 నెంబరును సంప్రదించవచ్చు.



బొబ్బిలి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీపుల్స్ మేనిఫెస్టో

ఉపాధి అవకాశాలు కల్పించాలి



గరుగుబిల్లి: యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పిస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ఈ ఐదేళ్లలో ఉపాధి అవకాశాలు లేక వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా దృష్టి సారించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు మెరుగుపర్చాలి. యువతకు ఉన్నత విద్య మరింత చేరువ కావాలి. విద్యార్థులకు అనువైన ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో కల్పించే ప్రభుత్వాలకు మా మద్దతు ఉంటుంది.

- అక్కేన నారాయణరావు, సాంబన్నవలస, గరుగుబిల్లి మండలం

ఎన్నికల ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

- విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

కలెక్టరేట్: ఎన్నికల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూంలో ల్యాండ్ లైన్ 08922-797120, 08922-797124 నెంబర్లను ఏర్పాటు చేసినట్లు విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెంబర్లకు ఫోన్ చేసి.. మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయవచ్చని... ఎన్నికల సమాచారాన్ని పొందవచ్చునని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులను ప్రజా యాప్ సివిజిల్ ద్వారా కూడా స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ యాప్ కోసం ఆండ్రాయిడ్ ఫోన్‌లో కెమెరా ఆప్షన్ ఉండాలన్నారు. ఫొటోలు, ఆడియో, వీడియోలను, మోడల్ కోడ్ ఉల్లంఘన లైవ్ రిపోర్టింగ్‌ను ఈ యాప్ ద్వారా పంపవచ్చునవి తెలిపారు. ముందుగా రికార్డ్ చేసి ఫొటోలు, వీడియోలు, ఈ యాప్‌లో అనుమతించబడవని పేర్కొన్నారు. ఫిర్యాదు అందించిన 100 నిమిషాల్లో క్షేత్ర స్థాయిలో విచారించి... సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదు దారు పేరు, ఫోన్ నెంబరు రాయవచ్చని... లేకపోయినా ఫిర్యాదును స్వీకరించి... చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ నెంబరు కూడా ఉందని తెలిపారు.

ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలి

పెద్దల మాట



సాలూరు రూరల్: ఎన్నికల వరకే పార్టీలు, నాయకులు రాజకీయాలు చేయాలి. ఎన్నికలు ముగిసిన తరువాత అభివృద్ధిపై శ్రద్ధ చూపాలి. గతంలో ఎన్నికల ప్రచారం పెద్దగా హడావుడి లేకుండా సాగేది. ప్రచారశైలిలో ప్రస్తుతం మార్పులు చూస్తున్నాం. నామినేషన్‌కే ప్రస్తుతం ఆర్భాటం చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి. నాయకులు, కార్యకర్తల వ్యవహార శైలిలో మార్పులు వచ్చాయి. శుభకార్యాలు, పండుగ శుభాకాంక్షల ఫ్లెక్సీలపై పార్టీ నేతల ఫొటోలు ముద్రిస్తున్న పరిస్థితులు వచ్చాయి. కాలంతో పాటు పార్టీల తీరు మారుతోంది. ప్రతి ఒక్కరు ఓటు వినియోగించడానికి అప్పుడు ప్రాధాన్యమిచ్చేవారం. ఈ ఎన్నికల్లో సైతం ఓటు వేయడానికి ప్రాధాన్యమిస్తాను.

- నరేళ్ల రామారావు (88), సాలూరు




ఓటేయడానికి గుర్తింపు కార్డులివే

(చీపురుపల్లి)

పోలింగ్ రోజున ప్రతి ఓటరూ తమతో బాటు పోలింగ్ స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించడానికి అవకాశం ఉంది. ఓటరు తమకు నచ్చిన లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డును తీసుకెళ్తే కుదరదు. ఓటరు తమతో పాటు ఎటువంటి గుర్తింపు కార్డును తీసుకుని వెళ్లాలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ 11 రకాల కార్డులను మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. దీని ప్రకారం..


- ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఈపీఐసీ)
- పాస్‌పోర్టు
- డ్రైవింగ్ లైసెన్సు
- సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి)
- పాస్‌బుక్ (ఫొటోతో బాటు బ్యాంకు/పోస్టాఫీస్‌లో జారీ చేసినవి)
- పాన్ కార్డు, ఆధార్ కార్డు
- స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
- ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ జాబ్ కార్డు
- ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి)
- ఫొటో పింఛన్ పత్రం
- అధికారిక గుర్తింపు కార్డు (ఎంపీలు/ఎంఎల్‌ఏలు/ఎంఎల్‌సీలకు జారీ చేసినవి)

బడ్డుకొండంత.. హామీలు!



పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన కొండ ప్రాంతం

- టేబుళ్ల మీదే ప్రతిపాదనలు
- మళ్లీ ఎన్నికలకు సిద్ధంపై సర్వత్రా విమర్శలు



(నెల్లిమర్ల)

గడిచిన ఐదేళ్లుగా నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యేగా వ్యవహరించిన బడ్డుకొండ అప్పలనాయుడు ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోయాయి. ఆయన చెప్పిన మాటలు నేటికీ నియోజక వర్గ ప్రజల చెవుల్లో గింగిర్లు కొడుతూనే ఉన్నాయి. ఆయన ప్రతిపాదించిన ఫైళ్లు టేబుళ్లపై నుంచి కదలలేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి. కొత్తగా హామీలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఓటర్లను తన వైపు తిప్పుకునేందుకు కొత్త పందాలపై కసరత్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలేవీ..?

నెల్లిమర్ల నగర పంచాయతీలోని సుమారు 1400 మంది పేదలకు అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీ ఇస్తామని అప్పట్లో ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రకటించారు. పట్టాలు కూడా పంపిణీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం కొండ ప్రాంతం కావడంతో లబ్ధిదారులు ఆ స్థలాన్ని వద్దని తిరస్కరించారు. అప్పటి నుంచి గత మూడేళ్లుగా ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తామని చెప్పడమే తప్ప.. కొత్తగా ఎక్కడా స్థలాన్ని చూపించలేదు. లబ్ధిదారులు చేతుల్లో ఇప్పటికీ పట్టాలు మాత్రమే ఉన్నాయి. స్థలం మాత్రం పొందలేకపోయారు.



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

మరికొన్ని ప్రతిపాదనల వరకే..

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 2023 మే 3న విమానాశ్రయం శంకుస్థాపనకు భోగాపురం వచ్చినపుడు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అభ్యర్థన మేరకు పలు అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నట్లు సభా వేదిక పైనుంచే ప్రకటించారు. ఇంత వరకు ఆ పనులు కాగితాలను దాటలేదు. నెల్లిమర్ల మండలంలోని గరికిపేట నుంచి తుమ్మలపేట వరకు, కొండవెలగాడ నుంచి రోళ్లవాక వరకు తారు రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంతవరకు ఆ పనులు ప్రారంభం కాలేదు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గ్రామం మధ్య నుంచి వెళ్తున్న నెల్లిమర్ల-శ్రీకాకుళం రాష్ట్ర రహదారికి బదులుగా రామతీర్థం బోడికొండను ఆనుకుని బైపాస్ నిర్మాణం చేస్తామని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన ప్రతిపాదనను ఎమ్మెల్యే బడ్డుకొండ తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పూర్తి చేయిస్తానని చెప్పారు. ఇంత వరకు అమలు చేయలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎమ్మెల్యేగా బడ్డుకొండ ఎన్నో హామీలు ఇచ్చినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోయినా మళ్లీ ఎన్నికలకు సిద్ధమంటుండడంపై నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు.

తారకరామ పూర్తయ్యేదెప్పుడో..

నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామం వద్ద నిర్మాణ దశలో ఉన్న తారక రామ రిజర్వాయర్ తన హయాంలో పూర్తిచేసి సాగునీరు అందిస్తానని ఇచ్చిన మాట అలాగే ఉండిపోయింది. నిర్మాణం ఇప్పటికీ కొన... సాగుతూనే ఉంది. సాగునీటి కోసం డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన రైతులు కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. రిజర్వాయర్ నిర్మాణం 2007లో ప్రారంభమై నేటికీ కొనసాగుతూనే ఉంది. ముంపు బాధితుల సమస్యలు తీర్చలేదు. వారికి నష్టపరిహారం చెల్లింపు కూడా పూర్తి చేయలేదు. నిర్వాసిత గ్రామాల నిర్మాణానికి ఇంత వరకు స్థల సేకరణే జరగలేదు. ముంపు బాధితులు తమ పొలాలను కోల్పోయి ఉపాధి లేక అల్లాడుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 25 వేల ఎకరాలకు సాగునీటితోపాటు విజయనగరం, నెల్లిమర్ల తదితర ప్రధాన పట్టణాలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఈ సమస్యలన్నీ ముఖ్యమంత్రి జగన్ దృష్టి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని చెప్పి.. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నేటికీ వాటిని పరిష్కరించలేకపోవడం విశేషం. ఆ సమస్యలు అలాగే ఉన్నా... మళ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు కొత్త హామీలు గుప్పిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



నత్తనడకన నిర్మాణం సాగుతున్న తారకరామ రిజర్వాయర్



బైపాస్ నిర్మాణానికి ప్రతిపాదించిన బోడికొండ ప్రాంతం

కొత్త జిల్లా.. పాత కష్టాలు

- ఇదీ భామిని మండలంలో పరిస్థితి

(భామిని)

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని మండలాల్లో అభివృద్ధి కనిపించడం లేదు. భామినిలో విద్యా సంస్థలు మినహా మరే అభివృద్ధి కానరావడం లేదు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్న వైసీపీ పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. ఎప్పటిలాగానే అవి ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేసినప్పటి నుంచి మండల ప్రజలు అసంతృప్తిగానే ఉన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న సమస్యలే ఇప్పటికీ వెంటాడుతున్నాయనే భావన ప్రజల్లో ఉంది. మన్యం జిల్లాగా ఆవిర్భవించిన తర్వాత ఒక్కటంటే ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు వాపోతున్నారు. వంశధార నది నుంచి నీరు సముద్రం పాలవుతోంది తప్ప వినియోగించడం లేదు. పంట పొలాలు వరదలకు నదీ గర్భాల్లో కలిసిపోతున్నాయి. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వంశధార నది వల్ల ఎటువంటి ఫలితం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో కాట్రగడ వద్ద డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేసినా..అది కార్యరూపం దాల్చేందుకు వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఈ ప్రాంతీయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు నుంచి బత్తిలి వరకు 30 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారి మరమ్మతుకు గురైనా పట్టించుకొనే నాథుడే లేరని ప్రయాణికులు ప్రభుత్వంపై మండి పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మండలాన్ని కలిపినా ఆర్టీసీ బస్సు జిల్లా కేంద్రానికి ఏర్పాటు చేయలేదు. అలా అని డివిజన్ కేంద్రమైన పాలకొండకు కూడా బస్సు సౌకర్యం లేదు. వైద్యసేవల కోసం గర్భిణులు ఇప్పటికీ పొరుగు జిల్లాలోని కొత్తూరు పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే. ఇలా అడుగుకో సమస్య ప్రజలను వేధిస్తున్నాయి. అన్నిటినీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.



వాహనం వెనుక వెళ్తే ఇంతే..



కాట్రగడ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి వేసిన శిలాఫలకం



అధ్వానంగా ఉన్న అలికాం-బత్తిలి రహదారి

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయాలంటే...

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా ప్రమోద్‌కుమార్ మెహర్దను ఎన్నికల సంఘం నియమించింది. ఆయన జిల్లాకు చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేస్తున్నారు. పరిశీలకుల ఫోన్ నెంబర్ 75698 98830. పరిశీలకుల సమన్వయ అధికారిగా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.డి.నాయక్ 94944 27717 వ్యవహరిస్తున్నారు. వీరికి నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయవచ్చు.

పోలీసు పరిశీలకులకు...

పార్లమెంటరీ నియోజకవర్గ పోలీసు పరిశీలకులుగా నయీంముస్తఫా మన్సూరిని ఎన్నికల సంఘం నియమించింది. ఆయన జిల్లాకు చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేస్తున్నారు. పోలీసు పరిశీలకుల ఫోన్ నెంబర్ 75698 20106. పరిశీలకుల సమన్వయ అధికారిగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్.అశోక్‌కుమార్ 9182361384 వ్యవహరిస్తున్నారు. ఎన్నికల్లో శాంతిభద్రతల సంబంధిత అంశాలపై అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నియోజకవర్గాల సమాచారం, ఫిర్యాదులు వీరికి సమర్పించవచ్చునని ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల గుర్తులు ఎలా వచ్చాయంటే..

మీకు తెలుసా?

(కొమరాడ)

భారతదేశంలో 1952లో జరిగిన తొలి ఎన్నికల సమయానికి అక్షరాస్యత 16 శాతమే ఉండేది. దీంతో ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గుర్తించడం కష్టతరం కాబట్టి సులభంగా గుర్తించేందుకు వీలుగా బ్యాలెట్ పత్రంలో గుర్తులను ఉంచాలని నిర్ణయించారు. ఇందుకుగాను 1950లో ప్రముఖ చిత్రకారుడు ఎంఎస్ సేథితో పెన్సిల్‌తో చిత్రాలను గీయించి.. వాటిలో గుర్తులను ఎన్నికల బ్యాలెట్ పత్రంలో ఉపయోగించుకున్నారు. అలా వివిధ రకాలుగా ఆధునికతను సంతరించుకుని ఎన్నికల గుర్తులు రూపొందాయి. ఎంఎస్ సేథి 2000వ సంవత్సరంలో కన్ను మూశారు. ఇదిలా ఉండగా కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు వారు ఎంచుకున్న గుర్తులను కేటాయించేది. వివిధ రాజకీయ పార్టీల తరుపున బీ-ఫారం సమర్పించి... పోటీ చేసే వారికి ఆ పార్టీ గుర్తులను కేటాయించారు. ఈవీఎంలు వచ్చాక గుర్తులతో పాటు అభ్యర్థి పేరు, ఫొటోతో పాటు కేటాయించిన గుర్తును అందుబాటులో ఉంచారు.

ఇంటి వద్దకే ఓటు

విజయనగరం (ఆంధ్రజ్యోతి)



తాజా ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ఓ నిర్ణయం తీసుకుంది. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. వీరు పోలింగ్ కేంద్రానికి వెళితే సరే.. లేదంటే.. అధికారులు ఇంటి వద్దకే వచ్చి వారి ఓటును వినియోగించుకునే విధంగా రూపకల్పన చేసింది. సర్వేలో గుర్తించిన వారి ఇళ్లకు పోలింగ్ అధికారులు వెళ్లి వారి దగ్గర ఉండి.. ఓటేసేలా చర్యలు చేపడుతున్నారు. తొలి విడతగా మే నెలలో 7, 8 తేదీల్లో జరగనుంది. ఈ రెండు తేదీల్లో ఓటేయలేని వారికి మరోసారి అదే నెలలో 9, 10 తేదీల్లో ఓటేసేలా ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. రెండు విడతల్లో జరిగే ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారు. ఏఆర్‌ఓకు సహాయకులుగా సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌ఓలు, పోలీసు సిబ్బందితో పాటు వీడియోగ్రాఫర్లు, పోలింగు కేంద్రాల పరిధిలోని ఏజెంట్లు ఉంటారు.

జిల్లాలో ఇలా..

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 85 ఏళ్ల దాటిన వృద్ధులు 7,181 మంది ఉన్నారు. విభిన్న ప్రతిభావంతులు 21,993 మంది ఉన్నారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేస్తారా? కుదరకపోతే, ఇంటివద్దే ఓటేస్తారా అనే వివరాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారులు సర్వే చేశారు. ఇలాంటి వారి కోసం ఎన్నికల సంఘం ప్రత్యేకంగా పోలింగ్ సిబ్బందిని నియమించింది.

ఏజెంట్లే కీలకం

(కొమరాడ)

ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా? అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరుపున ప్రాధాన్య క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రీసైడింగ్ అధికారికి తెలపవచ్చు. ఏజెంట్లుగా అభ్యర్థులు తమకు నమ్మకమైన వారిని కూర్చోబెడతారు. ఏజెంట్ ఏ మాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టం కలుగుతుంది.

ఉత్కంఠ నగరం!

అభ్యర్థుల ఎంపికలోనూ... విజయావకాశాల్లోనూ... ప్రతిసారీ ఉత్కంఠకు గురిచేసే నియోజకవర్గం ఏదంటే... ఠక్కున గుర్తుకు వచ్చే పేరు గజపతినగరం. వివిధ సమీకరణాల నేపథ్యంలో అన్ని పార్టీలూ ఇక్కడి అభ్యర్థి విషయంలో చివరి వరకూ వేచి చూడడం పరిపాటి. గెలుపు విషయంలోనూ అంతే... ఫలితాలు వెలువడే వరకూ విజయం ఎవరిని వరిస్తుందనే విషయంలోనూ అటు అభ్యర్థులు.. ఇటు ఓటర్లు టెన్షన్‌తో ఎదురు చూడాల్సిందే.

- టీడీపీకి ఐదుసార్లు అవకాశం
- ప్రతిసారీ పోటాపోటీ
- ఇదీ గజపతినగరం ప్రత్యేకత

(గజపతినగరం)

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలిచిన గజపతినగరం అంటే సంచలనాలకు మారు పేరు. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి అన్ని వర్గాల వారిని ఇక్కడి ప్రజలు ఆదరించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చివరి వరకు అభ్యర్థుల పేర్లు ఖరారు కాకపోవడం ఇక్కడి విశేషం. నువ్వా? నేనా? అన్నట్లుగా పోటీ ఉండడంతో అటు నాయకులు... ఇటు ఓటర్లలో తీవ్ర ఉత్కంఠ నెలకొంటుంది. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి 5 పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థులకు నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారు. గజపతినగరం నియోజకవర్గంలో కాపు, వెలమ సామాజిక వర్గాల వారే అధికం. మొట్టమొదటిగా బొండపల్లి మండలానికి చెందిన జంపన సత్యనారాయణరాజు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందగా... ఆ తరువాత రాజకీయాల్లోకి వచ్చిన పడాల అరుణ మూడుసార్లు విజయం సాధించారు. కె.ఎ.నాయుడు ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1955లో గజపతినగరం నియోజకవర్గం ఆవిర్భవించింది. మొదటి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రజా సోషలిస్టు పార్టీ నుంచి కుసుమ గజపతిరాజు పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత 1959లో జరిగిన ఉప ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా తాడ్డి సన్యాసినాయుడు పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 1962, 67లో కూడా తాడ్డి సన్యాసినాయుడు రెండు పర్యాయాలు పోటీ చేసి విజయం సాధించారు. 1972లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున పెనుమత్స సాంబశివరాజు పోటీ చేసి గెలుపొందారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా... 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా వంగపండు నారాయణ ప్పలనాయుడు రెండు పర్యాయాలు విజయం సాధించారు. 1983లో తెలుగుదేశం పార్టీ తరఫున జంపాన సత్యనారాయణరాజు పోటీ చేసి గెలుపొందగా... 1989, 1994, 2004లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పడాల అరుణ మూడు పర్యాయాలు పోటీ చేసి విజయం సాధించారు. 1999లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాడ్డి సన్యాసి అప్పలనాయుడు అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2009లో కాంగ్రెస్ తరఫున.. 2019లో వైసీపీ తరఫున బొత్స అప్పలనరసయ్య పోటీ చేసి విజయం సాధించారు. 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొండపల్లి అప్పలనాయుడు విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్, వైసీపీ అభ్యర్థిగా బొత్స అప్పలనరసయ్య, కాంగ్రెస్ నుంచి డోల శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఈ పర్యాయం నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో వేచి చూడాలి.

గజపతినగరం నియోజకవర్గ ముఖచిత్రం

నియోజకవర్గం పరిధిలోని మండలాలు..


గజపతినగరం నియోజకవర్గ పరిధిలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ మండలాలతో పాటు జామి మండలంలోని 15 గ్రామ పంచాయితీలు ఉన్నాయి.

మండలాల వారీగా..

మండలం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
గజపతినగరం	22550	23297	62
దత్తిరాజేరు	22313	22843	57
బొండపల్లి	19773	20567	52
గంట్యాడ	25547	26866	63
జామి	10044	10481	30

ఓటర్లు ఇలా..

మొత్తం ఓటర్లు:	2,04,286
పురుషులు:	1,00,227
మహిళలు:	1,04,054
ఇతరులు:	05



గజపతినగరం నియోజకవర్గం మ్యాప్


గజపతినగరం పట్టణం


పెనుమత్స సాంబశివరాజు


వంగపండు నారాయణప్పనాయుడు


తాడ్డి సన్యాసినాయుడు


పడాల అరుణ


బొత్స అప్పలనరసయ్య


కేవీ నాయుడు


తాడ్డి సన్యాసి అప్పలనాయుడు

గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యేలు

సం.	పేరు	పార్టీ
1955	కుసుమ గజపతిరాజు	ప్రజా సోషలిస్టు పార్టీ
1959	తాడ్డి సన్యాసినాయుడు	స్వతంత్ర పార్టీ
1962	తాడ్డి సన్యాసినాయుడు	స్వతంత్ర పార్టీ
1967	తాడ్డి సన్యాసినాయుడు	స్వతంత్ర పార్టీ
1972	పెనుమత్స సాంబశివరాజు	కాంగ్రెస్
1978	వంగపండు నారాయణప్పలనాయుడు	జనతా
1983	జంపన సత్యనారాయణరాజు	తెలుగుదేశం
1985	వంగపండు నారాయణప్పలనాయుడు	కాంగ్రెస్
1989	పడాల అరుణ	తెలుగుదేశం
1994	పడాల అరుణ	తెలుగుదేశం
1999	తాడ్డి సన్యాసి అప్పలనాయుడు	కాంగ్రెస్
2004	పడాల అరుణ	తెలుగుదేశం
2009	బొత్స అప్పలనరసయ్య	కాంగ్రెస్
2014	కొండపల్లి అప్పలనాయుడు	తెలుగుదేశం
2019	బొత్స అప్పలనరసయ్య	వైసీపీ

అక్కడ గెలిస్తే... మంత్రి పదవి ఖాయం!

- ఇదీ చీపురుపల్లి ప్రత్యేకత

(చీపురుపల్లి)

సెంటిమెంట్

చీపురుపల్లి నుంచి అసెంబ్లీకి ఎన్నికైన నాయకులను పలుమార్లు ముఖ్య పదవులు వరించాయి. ఇక్కడి నుంచి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టిన ఐదుగురు నాయకులు కేబినెట్‌లో స్థానం సంపాదించి... రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. కేబినెట్‌లో అవకాశం కోల్పోయిన మరో నాయకుడు ప్రభుత్వ విప్ పదవిని చేపట్టి... రాజకీయాల పరంగా చీపురుపల్లికి ఉన్న సంప్రదాయాన్ని కొనసాగించారు. 1978 నుంచి ఇప్పటి వరకూ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల తరపున గెలిచిన ఐదుగురు నాయకులకు ఉన్నత పదవులు దక్కాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించక ముందు 1978లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన చిగిలపల్లి శ్యామలరావు తొలిసారిగా మంత్రి పదవి చేపట్టారు. అప్పట్లో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి. ఆయన కేబినెట్‌లో శ్యామలరావు సమాచార శాఖ మంత్రిగా పని చేశారు. రాజకీయంగా ప్రాధాన్యం ఉన్న చీపురుపల్లికి మంత్రి పదవులు రావడం ఆయనతోనే ప్రారంభమైంది. ఆ తరువాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక... 1983లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో చీపురుపల్లి నుంచి గెలిచిన త్రిపురాన వెంకటరత్నంను ఆయన మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ఆమె స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత 1994, 99లో తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన గద్దే బాబూరావుకు మంత్రి వర్గంలో చోటు దక్కకపోయినప్పటికీ ప్రభుత్వ విప్ పదవి లభించింది. 2004లో జరిగిన ఎన్నికల్లో గెలిచిన బొత్స సత్యనారాయణ.... వైఎస్ హయాంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పదవిని చేపట్టారు. 2009లో రెండోసారి గెలిచిన ఆయన పంచాయతీ రాజ్ మంత్రిగా మరోమారు కేబినెట్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఆ తరువాత 2014లో చీపురుపల్లిలో దేశం జెండాను తిరిగి రెపరెపలాడించిన కిమిడి మృణాళినికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖలను అప్పగించారు. ఈ రకంగా చీపురుపల్లి నుంచి గెలిచిన నాయకులకు రాష్ట్ర రాజకీయాల్లోనూ... ముఖ్యంగా మంత్రివర్గాల్లో స్థానం దక్కుతోంది. ప్రభుత్వం ఏదైనా ఇలా మంత్రి వర్గ కూర్పులో చీపురుపల్లికి ప్రాధాన్యం ఇస్తుడండంతో... ఏ పార్టీకి చెందిన వారైనా ఇక్కడి నుంచి పోటీకి ఉత్సాహం చూపిస్తారనే మాట ఉంది.


త్రిపురాన వెంకటరత్నం


కిమిడి మృణాళిని


గద్దే బాబూరావు


బొత్స సత్యనారాయణ

ప్రచారంలో గీత దాటితే..

(కొమరాడ)

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఈ సందట్లో పార్టీలూ, కార్యకర్తలూ నిబంధనలు మరిచిపోయి అత్యుత్సాహంతో ప్రవర్తిస్తుంటారు. ఎన్నికల సంఘం ప్రచారా లకు స్పష్టమైన గీత గీసింది. ఆ నిబంధనలు ఇవీ..



- ప్రచార వాహనాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పత్రాన్ని వాహనానికి అతికించాలి. వాహనాన్ని అనుమతి పొందిన అభ్యర్థే వాడాలి. ఇతరులు వాడితే చర్యలు తీసుకుంటారు.
- విద్యా సంస్థల్లో, వాటి మైదానాల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా కచ్చితంగా ఉండాలి.
- ప్రచారంలో టీపీలు, కండువాలు ఇవ్వవచ్చు. వీటిని ఎన్నికల ఖర్చులో చూపించాలి. ధరించే దుస్తులు మాత్రం ఇవ్వకూడదు.
- దేవుళ్ల ఫొటోలు, అభ్యర్థి ఫొటోతో కలిపి డైరీలు, క్యాలెండర్లు ప్రచురించకూడదు. వాహనాలపై కూడా మతపరమైన ఫొటోలు, అభ్యర్థి ఫొటోలు ఉండకూడదు.
- ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల తాత్కాలిక కార్యాలయాలు ఉండకూడదు.
- రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటలలోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- ఏజెంట్ సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలో ఓటరై ఉండాలి.
- ఊరేగింపు రూటును ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.
- దిష్టి బొమ్మలు తగులబెట్టకూడదు.

అప్పట్లో 21 ఏళ్లకు ఓటు హక్కు

(కొమరాడ)



కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల కాలంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. భారతదేశంలో మొదట సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్ సుకుమార్‌సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలి ఎన్నికల్లో 17.90 కోట్ల మందికి ఓటు వేసే అవకాశం కల్పించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1985 వరకు ఓటు హక్కు కనీస వయస్సు 21 సంవత్సరాలుగా ఉండేది. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990లో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన భారతదేశ మొదటి సాధారణ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా... 2014 నాటికి ఆ సంఖ్య 370కు చేరింది. బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించే విధానం నుంచి ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) వినియోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల నుంచి ఓటు ఎవరికి వేశారో తెలుసుకునేందుకు ఓటరు వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

స్థానికేతరులకే పట్టం

రాజాం రూరల్: 'మహారాష్ట్రలోని నాసికాత్రయంబకంలో పుట్టి ఆంధ్రదేశాన్ని గోదావరి నది సస్యశ్యామలం చేస్తోంది. ఈ వాస్తవం కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా?' అని 1967లో ఓ ఎన్నికల సభలో 'స్థానికేతర' అంశంపై ఆవేశంగా ప్రశ్నించారు దివంగత సర్దార్ గౌతు లచ్చన్న. అదే ఏడాది శ్రీకాకుళం లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికలలో లచ్చన్న తన రాజకీయ గురువైన ఆచార్య ఎన్‌జీ రంగాను స్వతంత్ర పార్టీ తరపున పోటీలో నిలిపారు. ఈ సందర్భంగా ప్రత్యర్థులు స్థానికేతర అంశాన్ని తెరపైకి తెచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న బొడ్డేపల్లి రాజగోపాలరావుతో పాటు ఇతర నాయకులంతా స్థానికేతరుడైన రంగా ఇక్కడ పోటీ చేయడమేమిటని ప్రచారంలో దుమ్మెత్తి పోశారు. చిత్తూరులో చిత్తుగా ఓడిపోయిన నాయకుడిని ఈ ఉపఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార సభల్లో రంగా ప్రసంగాలు ప్రజలలో ఆలోచనలను రేకెత్తించా యి. స్థానికేతరుడని భావించకుండా రంగాకు పట్టం కట్టి ఢిల్లీకి పంపించారు జిల్లా ప్రజలు.

స్థానికేతర నినాదం ప్రతి ఎన్నికలలో ఏదో ఒక నియోజకవర్గంలో తెరపైకి వస్తూనే ఉంది. ఇలాంటి స్థానికేతర నినాదాన్ని ప్రజలు పట్టించుకోరని చరిత్ర చెబుతోంది. ప్రాంతంపై అవగాహన... ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకునే వ్యక్తికే ఓటర్లు పట్టం కడుతున్నారు.


రాజాం పట్టణం

ఉణుకూరు నుంచి రాజాం వరకూ..

పూర్వపు ఉణుకూరు నియోజకవర్గం నుంచి నేటి రాజాం వరకూ ఈ ప్రాంతీయులు స్థానికేతరులకే పట్టం కడుతున్నారు. ఫలితంగా ఆ వ్యక్తులు చట్టసభలకు వెళుతున్నారు. 1962లో ఉణుకూరు నియోజకవర్గం నుంచి పాలవలస సంగం నాయుడు, 1972లో పాలవలస రుక్మిణమ్మ, 1994లో పాలవలస రాజశేఖరం ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిది పాలకొండ మండలం నీలానగరం. రాజాం, వంగర, రేగిడి, బలిజిపేట మండలాల ప్రజలు వారిని ఆదరించారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి వచ్చిన కోండ్రు మురళీమోహన్‌కు ఈ ప్రాంతీయులు బ్రహ్మరథం పట్టారు. 2009లో ఆయన రాజాం నుంచి గెలుపొంది వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2014, 19 ఎన్నికలలో రాజాం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే కంబాల జోగులుది పాలకొండ మండలం మంగళాపురం. ప్రస్తుతం పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థిది పాలకొండ మండలం ఎస్.కె.రాజపురం.

నియోజకవర్గాలకు పరిశీలకులు

విజయనగరం(ఆంధ్రజ్యోతి): జన సేన పార్టీ తరఫున పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల ని యోజకవర్గాల పరిధిలో పార్టీ పరిశీలకులను అధినేత పవన్ కల్యాన్ నియమించారు. శుక్రవారం దీని వివరాలను వెల్లడించారు. ప్రతి నియోకవర్గానికి ఇద్దరు చొప్పున పరిశీలకులను నియమించారు. జిల్లాలల్లో జనసేన కూట మి అభ్యరిగా నెల్లిమర్ల నుంచి లోకం మా ధవి పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గానికి రెడ్డి అప్పల నాయుడు, చంద్రమోహన్‌లను పరిశీలకులుగా నియమించారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందు ముందస్తు అడ్మిషన్లు పేరుతో తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ప్రతినిధులు గౌరీశంకర్, సునీల్ కోరారు. శుక్రవారం ఆర్ఐవో ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందించారు.

సంపద సృష్టికర్త చంద్రబాబే

దత్తిరాజేరు: రాష్ట్రంలో సంపద సృష్టించాలంటే చంద్రబాబు వల్లే సాధ్యమని గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చినకాద, కన్నాం, ఎం.లింగాలవలస, సరాయివలస, పోరలి, టి.బూర్జవలస, తిమిటేరు, భూపాలరాజపురం, బలభద్రరాజపురం, దత్తిరాజేరు గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు చప్ప చంద్రశేఖర్, బెజవాడ రాజేశ్వరి, మిరిత్తిరెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నెల్లిమర్ల: గుషిణి గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు డీసీసీబీ వైస్‌చైర్మన్ చనమల్లు వెంకటరమణ, ఇందిర దంపతులతో పాటు గ్రామపెద్దలు పాల్గొనారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

నగదు సీజ్

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారి సమీప హనుమాన్ జంక్షన్ సర్వీస్ రహదారిలో ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ ఎ.రవి కుమార్ శుక్రవారం తెలిపారు. పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి చెందిన మహాదాసు ఆదినారాయణ భోగాపురం వైపు నుంచి పూసపాటిరేగ వైపు కారులో వెళ్తుండగా, ఎస్ఐ పి.సూర్యకుమారి ఆ వాహనానిన నిలిపి, తనిఖీ చేశారు. దీంతో ఆదినారాయణ వద్ద రూ.లక్ష ఉన్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. అనంతరం జిల్లా గ్రీవెన్స్ కమిటీ ముందు హాజరు పరిచామని, గ్రీవెన్స్ కమిటీ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకునికి అవార్డు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలోని పూసపాటిరేగ ప్రభుత్వ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న కెల్ల వెంకట సత్య సూర్యారావు బెస్ట్ ట్రైనర్, బెస్ట్ మోటివేటర్, బెస్ట్ పబ్లిక్ స్పీకర్‌గా అవార్డు పొందారు. ఇంటికో స్పీకర్, ఇంటికో ట్రైనర్ అన్న నినాదంతో ప్రతి ఒక్కరినీ చైతన్యపరుస్తూ అవగాహన కల్పించారు. ఈ అవార్డుని ఇంపాక్ట్ క్లబ్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు చేతుల మీదుగా, మ్యూజికల్ ట్రైనర్ రామ్‌కమల్, చొక్కాపు వెంకట రమణ చేతుల మీదుగా హైదరాబాదులో అందుకున్నారు.

బాబును మళ్లీ రప్పిందాం సభలకు స్పందన

బాడంగి: తెలుగుదేశం పార్టీ చంద్రబాబునాయుడును మళ్లీ సీఎంగా రప్పిందాం అనే కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందని జిల్లా టీడీపీ పార్లమెంట్ పార్టీ బీసీ సాధికార సమితి కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం కోడూరు, రావివలస, మల్లంపేట, బ్రహ్మన్నవలస గ్రామాల్లో తిరిగి చంద్రబాబు మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలి, రాష్ట్రపరిస్థితిని వివరించారు.

మస్తర్లలో తేడాలు సహించేది లేదు: ఏపీవో

రేగిడి: ఉపాధి పనులకు సంబంధించిన మస్తర్లలో తేడాలు సహించేది లేదని ఏపీవో ఎస్.హరనాథ్ మేట్లు, సిబ్బందికి తెలిపారు. శుక్రవారం మునకలవలసలో డోలపారమ్మ చెరువు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో టీఏపార్థసారధి, ఫీల్డ్‌అసిస్టెంట్ త్రినాథ్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

విజయనగరం రూరల్: వైసీపీ ఐదేళ్ల పాలన ప్రజావ్యతిరేకంగా సాగిందని విజయనగరం పార్లమెంటు టీడీపీ కో-ఆర్డినేటర్ డాక్టరు కెఏ నాయుడు చెప్పారు. కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలను శుక్రవారం విజయనగరంలోని ఆర్ అండ్ బీ రోడ్డులో వున్న కార్యాలయంలో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గజపతినగరంతో సహా అన్ని నియోజకవర్గాలను గెలిపించి చంద్రబాబుకి కానుకగా ఇస్తానన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కొత్తవలస: గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు పడకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిం చేందుకు ప్రజలు సహకరించాలని కొత్తవలస సీఐ చంద్రశేఖరరావు కోరారు. శుక్రవారం మండలంలోని నరపాంలో గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బాధితుడికి వైద్య సాయం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని జూట్‌మిల్లు మూసేయడంతో ఉపాధి కోల్పోయిన కార్మికుడు పక్షవాతానికి గురై మంచం పట్టడంతో అతనికి ఉచితంగా వైద్యం అందించారు. స్థానిక తారకరామాకాలనీకి చెందిన పిరిడి రాంబాబు అనే జూట్ కార్మికుడు పక్షవాతానికి గురై బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో కారుణ్యఫౌండేషన్, రోటరీక్లబ్ చైర్మన్ జేసీ రాజు, ఎస్ఆర్ హస్పటల్ సీఈవో శ్రీనివాసన్ స్పందించి వైద్యునిచే పరీక్షలు చేయించారు. చికిత్సకు అవసరమైన అన్ని రకాల సహాయసహకారాలను ఉచితంగా అందిస్తామని రోటరీ అధ్యక్షుడు జేసీ రాజు హామీ ఇచ్చారు.

ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటితోటలు

శృంగవరపుకోట రూరల్: మండలంలో శుక్రవారం వేకువజామున వీచిన ఈదురుగాలులకు 50 ఎకరాల్లో అరటితోటలు నేలకొరిగాయి. మండలంలోని జడ్‌కుమారాం, కాపుసోంపురం, దొర్లపాలెం, మరుపల్లి గ్రామాల్లో తోటలు దెబ్బతిన్నాయి. పంట చేతికి వచ్చిన సమయంలో ఈగాలులు ఆర్థికంగా నష్టపరిచాయని రైతులు వాపోయారు.

యువకుడి ఆత్మహత్య

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బోగాది రాజేశ్ (18) ప్రేమలో విఫలమవడంతో కలత చెంది గడ్డి మందు తాగి ఈ నెల 23న ఆత్మహత్య చేసుకున్నాడు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పది చదివి ఇంట్లో ఉంటున్న రాజేష్, తండ్రి నడుపుతున్న దుకాణంలో సాయంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ప్రేమలో పడి, విఫలమవడతో ఆత్మహత్య చేసుకోవడంతో 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనమేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి తల్లిదండ్రులు, ఒక తమ్ముడు ఉన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చదలవాడ తెలిపారు.

వ్యయ పరిశీలకుల పర్యటన

శృంగవరపుకోట: శృంగవరపుకోట దేబీబొమ్మ కూడలి ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల స్టాటిక్ సర్వే లైన్స్ కేంద్రంను శుక్రవారం ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకుడు ఆకాష్ దీప్ పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. వాహనాల తనిఖీల విధానం పరిశీలించారు. స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణ, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కిరణ్ కుమార్ వున్నారు.



ఎస్.కోట స్టాటిక్ సర్వేలైన్స్ కేంద్రం పరిశీలిస్తున్న ఆకాష్ దీప్

చంద్రబాబు గెలుపు తథ్యం: బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన శుక్రవారం బొబ్బిలి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎ.వెలగవలస, నిమ్మలపాడు, కొయ్యకొండవలస, శివుడుగుడ్డివలస, చెల్లియ్యవలస, మూలవలస గ్రామాలలో ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సర్పంచ్ తమ్మిరెడ్డి సత్యం, రెడ్డి సంజీవి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు. ● **తెర్లాం:** సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం జగన్నదవలస, గోపాలవలస, టెక్కలివలస, అరసబలగ, మాదంబట్లవలస, గ్రామాల్లో బేబీనాయన ప్రచారం చేశారు. తెంటు లక్ష్మంనాయుడు మట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ● **మండలంలో** గంగన్నపాడు గ్రామంలో 10 కుటుంబాలు, జగన్నాథవలసలో 40 కుటుంబాలు, మోదుగవలసలో 10 కుటుంబాలు, వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు కలసి వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



నిమ్మలపాడుతో మాట్లాడుతున్నబేబీనాయన

సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది ఎన్టీఆర్

గుర్ల: దివంగత నేత ఎన్టీఆర్ ఆనాడు ప్రజల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని కూటమి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంక టరావు అన్నారు. మండలంలోని భూపాలపురం, నడుపూరు, ఆనందపురం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి ప్రచార సభలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల కోసం సాగునీరు, తాగునీరు తోపాటు యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నడుపూరు మాజీ సర్పంచ్ కోట్ల అప్పలనాయుడు, కృష్ణ, రాము, అప్పలనాయుడు తదితరులంతా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కళా వెంకటరావు పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళా

జగన్‌కు ఓటుతో బుద్ధిచెప్పండి

రేగిడి: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కుటమి అభ్యర్థులను గెలిపించి జగన్ సర్కారుకు ఓటుతో బుద్ధిచెప్పాలని జనసేన స్టార్ క్యాంపైనర్, సినీనటుడు పృధ్వీరాజ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజాం నుంచి పాలకొండ వెళ్తున్న పృధ్వీరాజ్‌ను శుక్రవారం సంకిలి వద్ద జనసేన కార్యకర్తలు ఆయనతో మాట్లాడారు. సంకిలి జనసేన నాయకులు బలసాశ్యామ్, గునుపురు రాము, బైరి వెంకట్రావు, బట్న సత్యవతి, ఇజ్జు రమణ, గుండ మధుసుదనరావు స్థానిక సమస్యలు వివరించారు. ఆయన వెంట జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, మహాదాసు సంత్ ఉన్నారు.



మాట్లాడుతున్న పృధ్వీరాజ్, జనసేన నాయకులు

సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన

లక్కవరపుకోట: మండలంలోని కల్లెంపూడి, గొల్జాం, రంగాపురంలో టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చొక్కాకుల మల్లునాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** ఎస్.కోట శ్రీనివాసకాలనీలో టీడీపీ అభ్యర్థి లలిత కుమారి కుమార్తె హసితనాయుడు, ఖాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయు డు ఆధ్వ ర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ను లలిత కుమారి, ఎం.శ్రీభర త్‌ను గెలిపించాలనికోరారు. కార్యక్రమంలో నాయ కులు కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, కాపుగంటి వాసు, పెదగాడి రాజు, పోట్నూరు సాయిరాం, గన్ను బంగారమ్మ, వాకాడ బాలు, భీశెట్టి అరుణ పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** ఎల్.కోటలో కోళ్ల లలితకు మారి ఇంటివద్ద శుక్రవారం బీజేపీ, టీడీపీ, జనసేన శాఖ పార్లమెంట్ నేతలు సమావేశమయ్యారు.

అదితి గజపతిరాజు సమక్షంలో పలువురి చేరిక

విజయనగరం రూరల్, ఏప్రిల్ 26: టీడీపీ, బీజెపీ, జనసేన కూటమి ఉమ్మడి అభ్యర్థి. అదితి గజపతిరాజు సమక్షంలో నగరంలోని 25వ డివిజన్ పరిధిలోని మంగళవీధి ప్రాంతానికి చెందిన పతివాడ శంకరరావు, పతివాడ రమణ, కోన సాయిలక్ష్మీ, పతివాడ మీనా, కొల్లి ఎల్లారావుతో పాటు పది కుటుంబాలు అశోక్ బంగ్లాలో శుక్రవారం సాయంత్రం పార్టీలో చేరారు. వీరికి పసుపుకండువాలు వేసి అదితి గజపతిరాజు పార్టీలోకి ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, మార్తి నారాయణప్పుడు, పిళ్లా విజయ్‌కుమార్, వారణాసి మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర బీసీ సంఘం నాయకుడు, వైసీపీ విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి విజయనగరంనకు చెందిన ముద్దాడ మధు, విజయనగరం నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ మెంబరు ముద్దాడ రమణి వారి అనుచరులతో కలిసి శుక్రవారం వైసీపీని వీడి టీడీపీ, జనసేన, బీజెపీ ఉమ్మడి విజయనగరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనా యుడు, అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేశారు.

వైసీపీ పతనం ఖాయం: కోండ్రు

రాజాం: రానున్న ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమని రాజాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 80 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. రేగిడి మండలం కొండవలస, రాజాం మండలం బొద్దాం, ముద్దాడజోగివలస, వంగర మండలానికి చెందిన 20 చొప్పున కుటుంబాలకు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నక్క వెంకటి సత్యం, బట్న ఆదినారాయణ, అప్పలరాజు, సత్యనారాయణ, సూర్యనారాయణ, పైల గోవింద, నర్సింహులు, యేగేశ్వరరావు, గుర్గారావు పాల్గొన్నారు. అలాగే శ్యాంపురం, గయ్యన్నవలస, రామానుజులపేటల్లో కోండ్రు మురళీమోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఆయన వెంట గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, బోర నారాయణరావు, చీడి రమేష్ ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో కోండ్రు

రేపు రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం ఈనెల 28 వ తేదీన ఉదయం 9, 30 గంటలకు జరుగుతుందని వేదిక నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

పైడిమాంబకు గాజులతో అలంకరణ



విజయనగరం రూరల్, ఏప్రిల్ 26: పైడిమాంబకి శుక్రవారం వివిధ రకాల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. మూడులాంతర్లు వద్ద చదురుగుడి వద్ద ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఆలయ అధికారులు, అర్చకులు నిర్వహించారు. శుక్రవారం కావడంతో భక్తులు పైడిమాంబను దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించారు. ● మూడులాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడి వెనుక భాగాన ఉన్న పైడిమాంబ నిత్యానదాన భవనంలో ప్రతి రోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి భక్తులు ఎవరైనా విరాళాలు ఇవ్వాలనుకుంటే 9491000710 నెంబరును సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జామి: మండల కేంద్రమైన జామి ఎల్లమాంబకాలనీకి చెందిన గెదెల సింహాచలం(46)అనుమానస్పదస్థితిలో మరణించినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. కొద్దికాలంగా గాస్ట్రిక్‌తో బాధపడుతున్న సింహాచలం అందుకోసం ప్రైవేటు మందుల షాపుల్లో మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 25 ఉదయం ఇంటినుంచి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. శుక్రవారం స్థానిక కొండపాడు మెట్టవద్ద అనుమానస్పదరితిలో మృతి చెంది పడిఉన్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తన భర్త ఒంటిపై కొన్నిచోట్ల చిన్నపాటి దెబ్బలు, శరీరంలో కొన్ని చోట్ల రగిడిపోయి ఉందని మృతుడి భార్య ఫిర్యాదు చేయడంతో అనుమానస్పదమృతిగా కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.